నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, ఆదివారం 27 అక్టోబర్ 2024 | SANGAREDDY

పత్తి పంటలో గంజాయి సాగు

వట్‌పల్లి, అక్టోబర్ 26: పత్తిలో సాగు చేస్తున్న గంజాయి పంటను ఎక్సైజ్ సీఐ వీణారెడ్డి బృందం పట్టుకుంది. మండలంలోని ఉసిరికపల్లి గ్రామంలో నమ్మదగిన సమాచారంతో శనివారం ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. అందోల్ ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి వివరాల ప్రకారం..ఉసిరికపల్లిలో మన్నె విఠల్ పత్తిలో అంతర పంటగా గంజాయి సాగు చేస్తున్నాడనే సమాచారంతో ఎక్సైజ్ సిబ్బంది దాడి చేసి 16 కిలోల ఎండు గంజాయి, 17 పచ్చి గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. పచ్చి గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు. ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సాగుదారుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఎక్సైజ్ ఎస్సై అనిల్, సిబ్బంది రామారావు తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లా ఉసిరికపల్లిలో వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ సీఐ వీణారెడ్డి

పటాకుల దుకాణాలకు అనుమతి తప్పనిసరి

మెదక్ అర్బన్, అక్టోబర్ 26: దీపావళి పండుగ సందర్భంగా పటాకుల దుకాణాదారులు తప్పకుండా సంబంధిత డివిజినల్ స్థాయి పోలీస్ అధికారుల అనుమతి తీసుకోవాలని మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. అనుమతిలేకుండా టపాకాయల దుకాణాలు నెలకొల్పినట్లయితే వారిపై ఎక్స్‌ప్లోజివ్ యాక్ట్ 1884, రూల్స్ 1933 సవరణ 2008 ప్రకారంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. టపాకాయల దుకాణాలను సంబంధిత ఖాళీ ప్రదేశాల్లో నెలకొల్పాలని, ఖాళీ ప్రదేశానికి సంబంధించిన ఎన్‌వోసీ సర్టిఫికెట్ పొందుపర్చాలని ఎస్పీ పేర్కొన్నారు. ఒక క్లస్టర్‌లో 50 షాపులకు మించరాదని, జన రద్దీ గల ప్రదేశాల్లో ఎలాంటి టపాకాయల షాపులు ఏర్పాటు చేయరాదని సూచించారు. దుకాణాల్లో 18 సంవత్సరాల వయస్సు నిండిన వారే పనిచేయాలని, గోదాం ఊరికి 5 కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ పేర్కొన్నారు.

అభివృద్ధికా..అధికారం కోసమా !

- సిద్దిపేట జిల్లా మొత్తం 'సుడా' పరిధిలోకి..
- జిల్లాలో మరో అధికార కేంద్రం ఏర్పాటు కానున్నదా..?
- సిద్దిపేట కాంగ్రెస్ నేతల ఆశలు ఆడియాశలు

సిద్దిపేట, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): సిద్దిపేట అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ(సుడా)ను విస్తరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సిద్దిపేట జిల్లా అంతటికి సుడాను విస్తరిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇది వరకు సిద్దిపేట మున్సిపాలిటీతో పాటు 26 గ్రామాలు సుడా పరిధిలోకి వచ్చేవి. తాజాగా జిల్లా అంతటికి సుడాను విస్తరించడంతో మరో అధికార కేంద్రం ఏర్పాటు కానున్నది. సిద్దిపేట జిల్లాలో మొత్తం 26 మండలాలు ఉన్నాయి. వీటిలో మర్కూక్, ములుగు, వర్గల్ మండలాలు హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్నాయి. ఇవి పోను మిగిలిన 23 మండలాల్లోని 286 గ్రామాలు దుబ్బాక, గజ్వేల్– ప్రజ్ఞాపూర్, హుస్నాబాద్, చేర్యాల మున్సిపాలిటీలను సుడా పరిధిలో కలుపుతూ ప్రభుత్వం ఈనెల 15న జీవోను విడుదల చేసింది. జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాలతో పాటు హుస్నాబాద్ నియోజకవర్గంలోని హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాలు, జనగామ నియోజకవర్గంలోని చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, ధూళిమిట్ట మండలాలు, మానకొండూరు నియోజకవర్గంలోని బెజ్జంకి మండలాలు సుడా పరిధిలోకి వస్తాయి. సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా)ను 30 అక్టోబర్ 2017న అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సిద్దిపేట మున్సిపాలిటీ నుంచి 10 కిలోమీటర్ల పరిధిలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసి 2018 ఏప్రిల్‌లో నూతనంగా 14 మందితో పాలక మండలిని నియమించింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం సుడాను జిల్లా అంతటికి విస్తరించింది.

అధికారం కోసమేనా..?

సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) విస్తరణ అధికారం కోసమేనా..? పదవుల కోసమా..? అనే చర్చ జిల్లాలో జోరుగా జరుగుతున్నది. సుడాను విస్తరించడంతో జిల్లాలో

'సుడా'ను విస్తరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

సిద్దిపేట పట్టణ వ్యూ

మరో అధికార కేంద్రం ఏర్పాటు కానున్నది. సిద్దిపేట జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాంగ్రెస్ నేతలకు పదవుల సృష్టించడం కోసమే దీనిని విస్తరించినట్లు సమాచారం. సుడాకు వైర్మన్‌తోపాటు జంబో కార్యవర్గాన్ని ప్రభుత్వం నియమించనున్నది. హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సుడా ను జిల్లా అంతటికి విస్తరించటంతో అధికారం తమ చేతుల్లోకి తెచ్చుకోవచ్చు అనే లక్ష్యంతో ఈ రకంగా చేసి ఉంటారన్న చర్చ జరుగుతున్నది. అభివృద్ధి మాట దేవుడెరుగు కానీ కాంగ్రెస్ పార్టీ నేతలకు మాత్రం పదవులు రానున్నయని మాటలు వినిపిస్తున్నాయి. సిద్దిపేట పరిధి వరకు ఉన్నప్పుడు స్థానిక సీనియర్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఎంతోమంది సుడా చైర్మన్ పదవి కోసం పోటీపడ్డారు. తమకంటే తమకు సుడా చైర్మన్ పదవి అని చెప్పుకున్నారు. తాజాగా దానిని జిల్లా అంతటికి విస్తరించడంతో వారి ఆశలపై నీళ్లు చల్లినట్టైంది. ఇప్పుడు సిద్దిపేట నేతలకు ఈ పదవి వచ్చే అవకాశాలు లేవు. ఇప్పటికే జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవిని హుస్నాబాద్ ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నేతకు వరించింది. జిల్లా కేంద్రంలో ఉన్న ఎంతోమంది సీనియర్ నాయకులకు పదవులు వస్తాయని ఆశిస్తే వారి ఆశలు ఆడియాసలు అయ్యాయి.జిల్లా అంతటికి ప్రొటోకాల్ ఉండే ఈ వైర్మన్ పదవికి చాలామంది పోటీపడే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇతర ప్రాంతాలకు చెందిన నేతకు సుడా వైర్మన్ పదవిని ఇవ్వనున్నట్లు సమాచారం. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై మరో నెల రోజులైతే ఏడాది పూర్తి అవుతుంది. ఇంత వరకు జిల్లా అభివృద్ధికి రూపాయి నిధులు మంజూరు కాలేదు. అభివృద్ధి ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్నట్టుగా ఉంది. ఎన్నికల హామీలు ఏ ఒక్కటి సరిగ్గా అమలు కావడం లేదు. రైతుబంధు రాలేదు. రుణమాఫీ సగం మందికి అయ్యిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చేప పిల్లల పంపిణీ నిలిచిపోయింది. బతుకమ్మ చీరలు ఇవ్వలేదు. ఏడాది కాలంలో తాము ఇది చేశామని గొప్పగా చెప్పుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏదీ లేదు, అందుకే ఇలా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నదని అన్నివర్గాలు విమర్శిస్తున్నాయి.

సంగారెడ్డి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు

- ఐదు మున్సిపాలిటీలు, 466 పంచాయతీలతో 'సుడా'
- మౌలిక వసతులు కల్పన, అభివృద్ధికి అవకాశం
- అథారిటీ చైర్మన్ పదవిపై కాంగ్రెస్ నేతల కన్ను

సంగారెడ్డి, అక్టోబర్ 26(నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా సంగారెడ్డి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా)ను ఏర్పాటు చేసింది. సంగారెడ్డి జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలు, 466 పంచాయతీలతో సంగారెడ్డి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(SUDA) ఏర్పాటు చేసింది. ఇప్పటికే జిల్లాలో 181 పంచాయతీలు హెచ్‌ఏండీఏ పరిధిలోని ఎనిమిది మండలాల్లో ఉన్నాయి. జిల్లాలోని మిగతా గ్రామ పంచాయతీలన్నీ సుడా పరిధిలోకి తెచ్చింది. జిల్లాలోని సంగారెడ్డి, సదాశివపేట, అందోల్–జోగిపేట, జహీరాబాద్, నారాయణఖేడ్ మున్సిపాలిటీలతో పాటు 21 మండలాల్లోని 466 పంచాయతీలను సుడా పరిధిలోకి వచ్చాయి. దీంతో జిల్లాలోని మున్సిపాలిటీలు, పంచాయతీలు అన్ని సుడా, హెచ్‌ఎండీఏల పరిధిలోకి చేరాయి. ఇది వరకే హెచ్‌ఏండీఏ పరిధిలో సంగారెడ్డి, కంది, రామచంద్రాపురం, పటాన్‌చెరు, అమీన్‌పూర్, గుమ్మడిదల, జిన్నారం, హత్నూర మండలాలు, అమీన్‌పూర్, తెల్లాపూర్, బొల్లారం, మున్సిపాలిటీలు, గ్రేటర్ హైదరాబాద్‌లో భారతీనగర్, పటాన్‌చెరు, రామచంద్రాపురం డివిజన్లు ఉన్నాయి. దీంతో జిల్లాలో వందశాతం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పరిధిలోకి వచ్చింది. సుడా ఏర్పాటుతో మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు మరింత అభివృద్ధి చెందే అవకాశాలు ఉంటాయి. మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా మున్సిపాలిటీల్లో ప్రణాళికాబద్ధ అభివృద్ధికి అవకాశం ఉంటుంది. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు, తాగునీటి సరఫరా, మెరుగైన పారిశుధ్య వ్యవస్థ ఏర్పాటుకు ప్రాధాన్యతిస్తారు. పంచాయతీల్లో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి దోహం చేస్తుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా నిధులు వచ్చే అవకాశం ఉంటుంది.

సుడాతో పన్నుల భారం

'సుడా' ఏర్పాటుతో మున్సిపాలిటీలు, పంచాయతీల్లో పన్నుల భారం పెరిగే అవకాశం ఉంది. జీప్లస్ 2పైన గృహ నిర్మాణాల అనుమతులు, కొత్త లేఔట్ల అనుమతులు తప్పనిసరిగా కొత్తగా ఏర్పాటైన 'సుడా' నుంచి తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో అనుమతుల జారీలో జాప్యం జరిగే అవకాశాలు ఉంటాయి. పంచాయతీల పరిధిలో సుడా కొత్తగా గ్రీన్‌జోన్, ఇండస్ట్రియల్‌జోన్, రెసిడెన్షియల్‌జోన్లను ఏర్పాటు చేయనున్నది. దీంతో సుడా నిర్దేశించిన ప్రాంతాల్లోనే నిర్మాణాలను చేపట్టాల్సి ఉంటుంది. పంచాయతీల కొత్త లేఔట్లకు అనుమతుల చార్జీలు, బిల్డింగ్ చార్జీలు పెరిగే అవకాశాలు ఉంటాయి.సుడా పరిధిలోకి వచ్చే మున్సిపాలిటీల్లోనూ ఆస్తిపన్ను, లేఔట్ల చార్జీలు, బిల్డింగ్ చార్జీల భారం పెరుగుతుంది.

సంగారెడ్డి పట్టణ వ్యూ

సుడా చైర్మన్ పదవిపై కాంగ్రెస్ నేతల కన్ను

కొత్తగా ఏర్పాటు కానున్న సుడాకు ప్రస్తుత జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ప్రభుత్వం తర్వాత కాలంలో సుడాకు చైర్మన్‌ను నియమిస్తుంది. నామినేటెడ్ పద్ధతిలో సుడా చైర్మన్‌ను ప్రభుత్వం నియమిస్తుంది. సుడా చైర్మన్ పదవిపై అప్పుడే కాంగ్రెస్ నేతల కన్ను పడింది. ఈ పదవిపై కొందరు కాంగ్రెస్ నేతలు అప్పుడే దృష్టిసారించారు. సమయానుకూలంగా పావులు కదిపేందుకు సిద్ధమవుతున్నారు.

సంగారెడ్డిలో పశుగణన బ్యానర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

పశుగణనకు ప్రజలు సహకరించాలి

సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 26: జిల్లాలోని ప్రతి గ్రామంలో ఇంటింటికీ పశువైద్య సిబ్బంది వచ్చి పశుగణన సమాచారాన్ని సేకరిస్తారని, వారికి సహకరించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి కోరారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పశుగణన కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు పశుగణన కొనసాగుతుందన్నారు. ఐదేండ్లకు ఒకసారి జరిగే పశుగణనలో భాగంగా జిల్లాలో 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. జిల్లాలోని ప్రతి గ్రామంలో 16 రకాల జంతు జాతులు, కోళ్లను లెక్కిస్తామని, పశు గణన ద్వారా పాలు, గుడ్లు, మాంస ఉత్పత్తితోపాటు ఉన్ని ఉత్పత్తి వివరాలు తెలుస్తాయన్నారు. సగటు వినియోగం, ఎగుమతులు, దిగుమతులు, పశువులకు కావాల్సిన టీకాలు, మందుల సరఫరా పశుగణన ద్వారా నిర్ధారించవచ్చని తెలిపారు. జిల్లాలో పశు గణన కోసం 131 మంది ఎన్యూమరేటర్లు, 33 మంది సూపర్ వైజర్లను నియమించామన్నారు. నిర్ణీత గడువులో సర్వే పక్కాగా పూర్తి చేయాలని సిబ్బందికి కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వసంతకుమారి, సహాయ సంచాలకులు రవీంద్రప్రసాద్, రాజేశ్వర్, ప్రభాకర్, పవన్‌కుమార్, వ్యాస్, శ్రీరాం చరణ్‌దాస్, అనూష పాల్గొన్నారు.

బలహీన వర్గాల అభివృద్ధికి కృషి

- శనిగరం గెస్ట్‌హౌస్‌ను పునరుద్ధరిస్తాం
- ఫిష్ పాండ్‌ను పునరుద్ధరించాలి • మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్

కోహెడ, అక్టోబర్ 26: బలహీన వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. మండలంలోని మధ్య తరహా ప్రాజెక్టు శనిగరంలో కలెక్టర్ మనుచౌదరితో కలిసి చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..మారుతున్న కాలానికి అనుగుణంగా కుల వృత్తులు మారాలన్నారు. మత్స్య శాఖకు సంబంధించి మొబైల్ మార్కెట్‌లో అమ్ముకోవడానికి మౌలిక వసతుల కల్పనకు కృషిచేస్తామన్నారు. శనిగరం దగ్గర ప్రభుత్వ భూమిలో ఫిష్ మార్కెట్ పెడతామని, అందుకు స్థల సేకరణ చేయాలని ఆర్డీవోకు ఆయన సూచించారు. హైదరాబాద్‌కు పోయేవారు ఇక్కడ చేపలు కొనుక్కొనేలా అభివృద్ధి చేయాలన్నారు. బీసీలు ఆయిల్‌పామ్, డ్రాగన్ ఫ్రూట్, చేపల చెరువు, కోళ్ల పెంపకం, ఆవులు గేదెల పెంపకంపై రైతు వేదికల వద్ద అవగాహన కల్పిస్తామని తెలిపారు. బ్యాంకర్లతో మీటింగులు ఏర్పాటు చేపి రుణాలు ఇప్పిస్తామన్నారు. యంగ్‌ఇండియా స్కిల్ యూనివర్సిటీ ద్వారా కులవృత్తుల మాడిఫికేషన్ ట్రైనింగ్ ఇచ్చి, మారుతున్న కాలానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రాజెక్టు పనుల్లో జాప్యం జరిగిందని, వేగంగా పూర్తిచేస్తామన్నారు. డబుల్ రోడ్డు పూర్తయిన తర్వాత అవెన్యూ ప్లాంటేషన్ కింద ఇరువైపులా మొక్కలు నాటుతామని చెప్పారు. త్వరలోనే టామ్‌కామ్ ద్వారా విదేశీ ఉద్యోగావకాశాలు కల్పిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో సిద్దిపేట కాంగ్రెస్ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, నాయకులు శంకర్ రాథోడ్, రాష్ట్ర మత్స్యశాఖ అడిషనల్ డైరెక్టర్, సిద్దిపేట ఫిషరీస్ అధికారులు, ఈఎన్‌సీ, సిద్దిపేట గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, ఆర్డీవో రామ్మూర్తి, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

కోహెడ శనిగరం ప్రాజెక్టులో చేప పిల్లలను వదులుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజలపై భారం

హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్

హుస్నాబాద్, అక్టోబర్ 26: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై పెనుభారం మోపాలని చూస్తున్నదని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ శనివారం ప్రకటనలో ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే ప్రజలపై భారం మోపుతున్నదని, 200 యూనిట్లు దాటితే గతంలో ఉన్న రూ.10 ఫిక్స్‌డ్ చార్జీలను రూ.50కి పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ప్రజలను ఇబ్బందులకు గురిచేయడమే అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతాంగానికి 24గంటల ఉచిత విద్యుత్ అందించి రూ.1200కోట్ల సబ్సిడీని ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. గృహలక్ష్మి పథకం పెట్టి చార్జీలు పెంచడం కాంగ్రెస్ చిత్తశుద్ధికి నిదర్శనమని, ప్రజలు చైతన్యవంతులై కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఉద్యమించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆనాడు కరెంటు చార్జీల పెంపుతోనే తెలంగాణ ఉద్యమం పుట్టిందని, ఈనాడు మళ్లీ చార్జీలు పెంచి కాంగ్రెస్ ప్రభుత్వం మరో ఉద్యమానికి ఊపిరిపోయనుందని తెలిపారు. కేసీఆర్ పాలనలో అటు రైతులు, ఇటు ప్రజలు ఎలాంటి కరెంటు కష్టాలు లేకుండా జీవనం కొనసాగించారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన పది నెలల్లో కరెంటు కోతలు, విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజ లు అవస్థలు పడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రజలపై రూ.18వేల కోట్ల భారం మోపేందుకు కుట్రలు జరుగుతున్నాయని, వీటిని ప్రజలందరూ ఐక్యంగా ఉండి పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోకుంటే ప్రజా ఉద్యమాలను ఉధృతం చేస్తామని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ హెచ్చరించారు.

ముట్రాజ్‌పల్లి–సంగాపూర్ మధ్య కేసీఆర్ హయాంలో నిర్మించిన ఆర్‌అండ్‌ఆర్ కాలనీ

పరిహారం వచ్చేనా..?

- భూనిర్వాసితుల ఎదురుచూపు
- ప్రభుత్వం స్పందించక పోవడంపై ఆవేదన
- గతంలో నిర్వాసితుల పక్షాన దీక్ష చేసిన రేవంత్‌రెడ్డి
- అధికారంలోకి వస్తే అండగా ఉంటామని హామీ
- ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడుస్తున్నా నిర్వాసితుల ఊసేలేదు

గజ్వేల్, అక్టోబర్ 26: బీఆర్ఎస్ హయాంలో సాగునీటి ప్రాజెక్టుల కోసం జిల్లాలో భూసేకరణ చేపట్టారు. భూనిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ప్రభుత్వం అందించింది. కోర్టు కేసులు, చిన్నపాటి కారణాలతో కొంతమందికి పరిహారం అందలేదు. వారు పరిహారం కోసం కాలం వెళ్లదీస్తున్నారు. భూనిర్వాసితులకు అండగా ఉంటామని ఆనాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు దీక్షలు చేసిన కాంగ్రెస్ నాయకులు, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక భూనిర్వాసితుల ఊసే ఎత్తడం లేదు. దీంతో నిర్వాసితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూసేకరణ చేపట్టినప్పుడు బాధితుల పక్షాన ఏటిగడ్డ కిష్టాపూర్‌లో రెండు రోజులపాటు రేవంత్‌రెడ్డి నిరాహార దీక్ష చేశారు. ప్రస్తుతం ఆయన సీఎంగా ఉండి కూడా నిర్వాసితుల గోడు పట్టించుకోవడం లేదు. అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ భూనిర్వాసితుల్లో కొంతమందికి రావాల్సిన ప్యాకేజీలపై నిర్ణయం తీసుకోవడం లేదు. ప్రభుత్వం ఎప్పుడు కరుణిస్తోందోనని నిర్వాసితులు ఆశతో ఎదురుచూస్తున్నారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో కొండపాక, తొగుట మండల్లాలోని 14గ్రామాలు ముంపునకు గురయ్యాయి. వీరందరికీ కేసీఆర్ ప్రభుత్వంలో గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని ముట్రాజ్‌పల్లి, సంగాపూర్ గ్రామాల మధ్య ఆర్‌అండ్‌ఆర్ కాలనీని నిర్మించారు. ఏటిగడ్డ కిష్టాపూర్‌లో 1253, లక్ష్మాపూర్‌లో 388, వేములఘాట్‌లో 1252, పల్లెపహాడ్‌లో 921, రాంపూర్‌లో 320, బ్రాహ్మణ బంజేరుపల్లిలో 267, ఎర్రవల్లిలో 800, సింగారంలో 330కి పైగా కుటుంబాలు ఉండగా, వీరి కోసం 2273 డబుల్ బెడ్‌రూం ఇండ్లను కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిది. ఆయా గ్రామాల్లో వ్యవసాయ భూమితోపాటు ఇతర ఆస్తులకు పరిహారం ఇవ్వడం ప్రతి కుటుంబానికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద రూ.7.50 లక్షలు, ఇల్లు అందజేశారు. ఇల్లు వద్దనుకున్న వారికి ఓపెన్‌ప్లాట్ మరో రూ.5.04 లక్షలు అందజేశారు. 18 ఏండ్లు నిండిన మగవారికి ఓపెన్ ప్లాట్, అమ్మాయిలకు పరిహారం చెక్కులు అందజేశారు. ఇదే తరహాలో కొండపోచమ్మ ముంపు గ్రామాల ప్రజలకు అందజేశారు. వారి కోసం 1141 డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించారు.

కానుకుంట రోడ్డుకు మోక్షమెప్పుడో..?

- గతంలో వచ్చిన నిధులు వెనక్కి..
- రోడ్డు అధ్వానంగా మారడంతో వాహనదారులకు తప్పని తిప్పలు

గుమ్మడిదల, అక్టోబర్ 26: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలోని కానుకుంట-గుమ్మడిదల రోడ్డు విస్తరణకు గతంలో మంజూరైన నిధులు కాంగ్రెస్ ప్రభుత్వంలో వెనక్కి వెళ్లాయి. దీంతో రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయాయి. ఈ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డబుల్‌రోడ్డు అవుతుందని హర్షం వ్యక్తం చేసిన ప్రజలు ఇప్పుడు ఈరోడ్డుపై నరకం అనుభవిస్తున్నారు. గతేడాది రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు రావడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. ఇటీవల ఎమ్మెల్యే రోడ్డు పనుల కోస రూ. 20.80 కోట్ల నిధులు మంజూరైనట్లు ప్రకటించారు. కానీ, పనులు ప్రారంభం కావడం లేదు. గుమ్మడిదల మండలంలో కొత్తపల్లి నుంచినాగిరెడ్డి గూడెం మీదుగా శివాయిగూడెం వరకు రోడ్డు నిర్మాణానికి రూ.1.50 కోట్లు, గుమ్మడిదల నుంచి బొంతపల్లి వీరభద్రస్వామి దేవాలయం వరకు రూ.1.90 కోట్లు, అన్నారం పంచాయతీ పరిధిలోని పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.1.10 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. త్వరగా రోడ్డు పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అసంపూర్తిగా నిలిచిపోయిన కానుకుంట– గుమ్మడిదల రోడ్డు పనులు

గుంతలున్నాయి.. జరపైలం

ఇంద్రేశంలో నడిరోడ్డుపై జెండాలతో హెచ్చరికలు

పటాన్‌చెరు, అక్టోబర్ 26: వామ్మో ఇంద్రేశం రోడ్డా అంటూ ప్రజలు వాపోతున్నారు. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం–దౌల్తాబాద్ రోడ్డు గుంతలమయంగా మారింది. విపరీతంగా దుమ్ముధూళి ఎగిసిపడుతుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంతలున్న చోట ఎర్రజెండాలు పాతి ప్రజలను ప్రమాదాలనుంచి రక్షించే ప్రయత్నం చేస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు గుంతలతో ప్రమాదాల బారిన పడుతున్నారు. విపరీతంగా వస్తున్న దుమ్ముతో స్థానికంగా వ్యాపారులు, ఇండ్లలోని ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డుపై ప్రయాణించడం అంటేనే బెంబేలెత్తే పరిస్థితి ఏర్పడింది. పటాన్‌చెరు ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డు నుంచి ఇంద్రేశం గ్రామం వరకు రోడ్డు అధ్వానంగా మారింది. పటాన్‌చెరు మండలంలోని ఐనోల్, పెద్దకంజర్ల, చిన్నకంజర్ల మీదుగా దౌల్తాబాద్, సర్వాపూర్ వరకు ఈ రోడ్డు వెళ్తుంది. ఇంద్రేశంలో భారీగా వెలుస్తున్న కాలనీలకు ఇదే ప్రధాన రహదారి కావడంతో వేలాది వాహనాలు ప్రయాణిస్తున్నాయి. ఆర్‌అండ్‌బీ ఆధీనంలోని ఈ రోడ్డును బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంద్రేశం–దౌల్తాబాద్ రోడ్డుపై ఎర్రజెండా పెట్టి ప్రమాదం అని హెచ్చరిస్తున్న ప్రజలు

మరో ఇద్దరు విద్యార్థినులకు అస్వస్థత

న్యాల్‌కల్ కస్తుర్బాగాంధీలో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

జహీరాబాద్, అక్టోబర్ 26 : సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ కస్తుర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం మరో ఇద్దరు విద్యార్థులు తీవ్రమైన దగ్గు, శ్వాసకోశ సమస్యలతో అస్వస్థతకు గురికావడంతో వారిని సంగారెడ్డి దవాఖానకు తరలించారు. వెంటనే న్యాల్‌కల్ పీహెచ్‌సీ వైద్యాధికారులు అమృత్‌రాజ్, గణపతిరావు పాఠశాలలో వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసి విద్యార్థులందరికీ వైద్యపరీక్షలు నిర్వహించారు. పాఠశాలలో తాగునీరు, భోజనం, వంటనూనె తదితర వస్తువులకు నిర్వహించిన పరీక్షల ఫలితాలు నార్మల్‌గానే ఉన్నాయని, ముందుజాగ్రత చర్యగా విద్యార్థులు మాస్కులు ధరించాలని వైద్యులు సూచించారు. పాఠశాలలో అదనపు గదులు, కలరింగ్ చేయడంతో విద్యార్థులు అస్వస్థతకు గురై ఉండవచ్చని వైద్యాధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం పాఠశాలకు చెందిన 11 మంది విద్యార్థులు అస్వస్థతకు గురికావడంతో జహీరాబాద్ ఏరియా దవాఖానకు తరలించి వైద్యం అందించారు. విద్యార్థినులకు దగ్గు, శ్వాసకోశ సమస్యలు మరింత తీవ్రం కావడంతో సంగారెడ్డి దవాఖానకు తరలించారు. పీఏసీఎస్ చైర్మన్ సిద్ధిలింగయ్య స్వామి, బీజేపీ మండల నాయకులు ఓంకార్ యాదవ